

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ 8లో..

బొగ్గు బ్లాక్ల వేలానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం 8లో..



కుక్కలు భౌ..బోయ్..

- దడ పుట్టిస్తున్న వీధి కుక్కలు
- వేల సంఖ్యలో వీధి కుక్కలు
- కానరాని నియంత్రణ చర్యలు
- రోజురోజుకు పెరుగుతున్న దాడులు
- గాయాలపాలవుతున్న చిన్నారులు, వృద్ధులు
- జంతు సంరక్షణ బోర్డు నిబంధనలతో ప్రతిబంధకాలు
- యానిమల్ బర్త్ కంట్రోలే మార్గం
- నాలుగేళ్లుగా జిల్లాలో ఊసే లేదు

కోల్‌సిటీ, జూన్ 20: జిల్లాలో వీధి కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. వీధి కుక్కలపై రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు, జంతు సంరక్షణ బోర్డు నిబంధనలు సమస్య పరిష్కారానికి ప్రతిబంధకంగా మారాయి. దీంతో జిల్లాలో వేల సంఖ్యలో వీధి కుక్కలు పెరిగిపోయాయి. ప్రతి రోజు ఏదో ఒకచోట వీధి కుక్కలు చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తూనే ఉన్నాయి. రామగుండంలోనే గత ఏడాది ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో పిల్లలను ఒంటరిగా పాఠశాలలకు పంపేందుకు పోషకులు జంకే పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో గ్రామాలు, మున్సిపాలిటీల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. గతంలో వీధి కుక్కలకు ఇంజెక్షన్లు వేసి నిర్మూలించేవారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఇందుకు టెండర్లు పిలిచి మరీ పనులు అప్పగించేవారు. రామగుండంలో కుక్కలను చంపి ట్రాక్టర్లలో మృతదేహాలను తీసుకెళ్లి ఖననం చేసిన ఘటనపై రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై స్పందించిన హైకోర్టు వీధి కుక్కలను సంరక్షించాలని, ఇందుకు జాతీయ జంతు సంరక్షణ బోర్డు మార్గ దర్శకాలను పాటించాలని ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కలను చంపవద్దని యంత్రాంగానికి సూచించింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) అమలు చేయడం ద్వారా వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నది. వీధి కుక్కలను పట్టుకొని బర్త్ కంట్రోల్ సర్జరీ చేసి రేబిస్ ఇంజెక్షన్లు ఇచ్చి తిరిగి వదిలిపెట్టాల్సి ఉంటుంది. ఒక్కో కుక్కకు 1000 రూపాయల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఇందుకు సంబంధించి ఎలాంటి బడ్జెట్‌ను విడుదల చేయలేదు. దీంతో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. జిల్లాలో 50 వేలకు పైగా వీధికుక్కలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం అమలు

యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ)ని నాలుగేళ్ల క్రితం రామగుండంలో అమలుచేశారు. వీధి కుక్కల నియంత్రణకు హైదరాబాద్‌కు చెందిన యానిమల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థకు పనులు అప్పగించారు. ఒక్కో కుక్కకు రూ.1200 చొప్పున చెల్లించేందుకు నిర్ణయించారు. 2020-21లో 5,446 కుక్కలకు ఆపరేషన్లు చేసి వ్యాక్సిన్ ఇచ్చినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈ మేరకు రూ.65 లక్షల బిల్లులు తయారుచేయగా ఇప్పటికే రూ.27 లక్షల బిల్లులు చెల్లించారు. మరో రూ.38లక్షల బిల్లులు పెట్టడంతో పాలకవర్గం అభ్యంతరం చెప్పింది. అసలు ఆ స్థాయిలో ఆపరేషన్లు చేయకుండానే బిల్లులు పెట్టారని పాలకవర్గం తిరస్కరించింది. దీనికి తోడు ఏబీసీ కోసం సిద్ధం చేసిన థియేటర్ కూడా వరదల్లో దెబ్బతిన్నది. అప్పటినుంచి ఆపరేషన్లు నిలిపివేశారు. గత ఏడాది కుక్కల బెడదపై ప్రజాప్రతినిధులు గొడవ చేయడంతో కుక్కలను పట్టేందుకు రూ.750, కోతులను పట్టేందుకు రూ.800 చొప్పున కేటాయించారు. వీటిని అటవీ ప్రాంతాల్లో వదలాలని నిర్ణయించినా సాధ్యం కాలేదు.

రామగుండంలో ఇద్దరు మృతి

రామగుండంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నర్రశాలపల్లికి చెందిన కటారి మల్లమ్మ అనే వృద్ధురాలు వీధి కుక్కలు దాడి చేయడంతో 2023లో మృతిచెందింది. ఎల్‌బీ నగర్‌కు చెందిన హమాలీ కార్మికుడు ధర్మేందర్(40)పై కూడా వీధి కుక్కలు దాడి చేయడంతో ప్రమాదానికి గురై మృతిచెందాడు. గోదావరిఖనిలో ఈ ఏడాది వీధి కుక్కల దాడులతో పలువురు తీవ్రంగా గాయ పడ్డారు. వీరిలో ఇద్దరు మున్సిపల్ కార్మికులు ఉన్నారు. మున్సి పల్ సూపర్‌వైజర్ సుగుణాకర్‌రెడ్డి విధుల్లో ఉండగా వీధి కుక్కలు దాడి చేయడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రతి రోజు పదుల సంఖ్యలో ఏదో ఒక చోట కుక్కలు దాడిచేస్తూనే ఉన్నాయి.

ఒకచోట పట్టి.. మరోచోట వదలడం..

వీధి కుక్కల బెడద తీవ్రమవడంతో కుక్కలను పట్టేందుకు మున్సిపాలిటీల్లో కాంట్రాక్టు ఇస్తున్నారు. ఇప్పటికే సుల్తానాబాద్, పెద్దపల్లి తదితర మున్సిపాలిటీల్లో కుక్కలను పట్టారు. రామగుండంలో ఎవరూ ముందుకు రాలేదు. పట్టిన కుక్కలను ఎక్కడ వదలాలన్న దగ్గరే వివాదం మొదలవుతుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పట్టిన కుక్కలను రామగుండం పరిసరాల్లో వదలడంతో ఇక్కడ వాటి సంఖ్య పెరిగిందని గొడవలు మొదలయ్యాయి. ట్రాలీల్లో తీసుకెళ్లి మంచిర్యాల జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వదిలేందుకు ప్రయత్నించగా సమీప గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఏబీసీ అమలే మార్గం..

మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో వీధి కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) అమలు చేయడమే ఏకైక మార్గం. జంతు సంరక్షణ బోర్డు నిబంధనల ప్రకారం వీధి కుక్కల నియంత్రణకు ఏబీసీ అమలుచేసి వాటిని సంరక్షించాల్సి ఉంది. ఇందుకు ప్రత్యేకంగా క్యాటిల్ షెడ్‌లను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. మున్సిపాలిటీలలో ప్రత్యేకంగా ఏబీసీ అమలుకు థియేటర్, కిచెన్, ప్రిప రేషన్ రూమ్ వంటివి నిర్మించాల్సి ఉంది. మున్సిపాలిటీలకు ప్రభుత్వం మంజూరు చేసే పట్టణ ప్రగతితో పాటు ఇతర నిధులను కూడా వినియోగించుకునే అవకాశం ఉంది.



వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్(ఫైల్)

ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్



కార్యాలయంలో తనిఖీ నిర్వహిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూన్ 20: కలెక్టరేట్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల తనిఖీ సమయంలో జిల్లా కలెక్టర్ ఉద్యోగుల విధులకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ ఇన్ వార్డు, ఔట్ వార్డు పరిశీలించి, రిజిస్టర్ లను తనిఖీ చేశారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కు వచ్చే ప్రతి దరఖాస్తుకు సంబంధించి పక్కాగా రికార్డు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



అభివృద్ధి పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీటౌన్, జూన్20: గోదావరిఖనిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అభివృద్ధి పనులను గురువారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ పరిశీలించారు. పనులు ఏవిధంగా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అలాగే రామగుండంలోని మల్యాలపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో కూడా అభివృద్ధిపనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామగుండం ఈఈగా రామన్

కోల్‌సిటీ, జూన్ 20: రామగుండం నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రామన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన విధుల్లో చేరారు. రామన్ గతంలో రామగుండంలో ఏఈగా పనిచేసి బదిలీపై కరీంనగర్‌కు వెళ్లారు.

లైసెన్స్ ఫీజు చెల్లింపులో జాప్యం జరిగితే జరిమానా

కోల్‌సిటీ, జూన్ 20: వ్యాపారులు ట్రేడ్‌లైసెన్స్ రుసుంచెల్లించడంలో జాప్యం చేస్తే 50శాతం అపరాధ రుసుం పడుతుందని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. 2024-25కు సంబంధించి ట్రేడ్‌లైసెన్స్ రుసుం చెల్లించే గడువు గత మార్చి నెలలో ముగిసినందు వల్ల ప్రస్తుతం 25శాతం పెనాల్టీ వసూలు చేస్తున్నామన్నారు. జూలై 1 నుంచి 50శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని, వ్యాపారులు దీనిపై జాగ్రత్తలు వహించాలని సూచించారు.

ఘనంగా ఎడ్లబండ్ల పందెం



బొంపల్లి గ్రామంలో ఎడ్లబండ్ల పందెం..

పెద్దపల్లి రూరల్, జూన్ 20 : మండలంలోని బొంపల్లి శ్రీరంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎడ్లబండ్ల పందెం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, గుర్రాల రాజు, రాజు, ఆలయ కమిటీ సభ్యుడు రమేష్ తదితరులు పందెంను ప్రారంభించారు. పందెంలో అప్పన్నపేట, బొంపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆరె సంతోష్, గుర్రాల రాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వద్దు.. మానేరు నీరే కావాలి..

- అధికారులకు తేల్చిచెప్పిన ముత్తారం గ్రామస్థులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

ముత్తారం జూన్ 20: మాకు స్వచ్ఛమైన మా గ్రామ శివారులో ఉన్న మానేరు మంచినీరే కావాలని మిషన్ భగీరథ నీటిలో మురికిగా వస్తున్నాయని రెండు రోజుల క్రితం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందించగా గురువారం మండల కేంద్రమైన ముత్తారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో లలిత ఆధ్వర్యంలో తాగునీటి శాఖ అధికారులు గ్రామస్తులతో కలిపి గురువారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు పరిశుభ్రంగానే ఉన్నాయని మిషన్ భగీరథ పథకం ప్రారంభంలోనే నీటిని ల్యాబ్ టెక్నీషియన్ ల ద్వారా పరీక్షించి గ్రామస్తులకు అందజేశామని ఇవి పరిశుభ్రం గానే ఉన్నాయని ఈ నీరు తాగితే రోగాలు రాకుండా ఉంటాయని అధికారులు గ్రామస్తులను నివారించే ప్రయత్నం చేశారు. అయినా గ్రామస్తులు మేము మా తాత ముత్తాతల నుండి మా గ్రామ శివారులను అనుకొని ఉన్న మానేరు వాగు నీటిని మంచినీరుగా తీసుకున్నామని ఏ రోగాలు లేకుండా జీవించామని మిషిన్ భగీరథ నీరు తాగినప్పటినుండి గ్రామస్థులము వ్యాధుల బారిన పడుతున్నామని వారు వివరించారు దీంతో తాగునీటి శాఖ అధికారులు తమ వెంబడి తీసుకు వచ్చిన ల్యాబ్ టెక్నీషియన్ ద్వారా గ్రామస్తుల ముందు మిషన్ భగీరథ నీటిని టెస్టు చేసి చూపించారు. ఇందులో ఎలాంటి కలుషితాలు లేవని స్వచ్ఛమైన నీరని తెలుపగా గ్రామస్తులు వినలేదు దీంతో ఏమి చేయలేని అధికారులు గ్రామస్తులు ముకుమ్మడిగా మిషన్ భగీరథ నీరు వద్దు మానేరు నీరే కావాలని వినతిపత్రం అందిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వేణుమాదవ్, తాగునీటిశాఖ అధికారులు డీఈ రాజుకుమార్, ఏఈ ప్రణవ్‌లు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంపత్‌గౌడ్



బుర్ర సంపత్‌గౌడ్

పెద్దపల్లిటౌన్, జూన్ 20: టీయుడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుర్ర సంపత్‌గౌడ్‌ను ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంపత్ గౌడ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. జర్నలిస్టులపై దాడులను ఖండించి పలు ఉద్యమాలు చేపట్టారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సంపత్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మైన్స్ కార్మికులను కలిసిన కార్మిక సంఘం నాయకులు



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

పాలకుర్తి,జూన్ 20: ఇటీవల కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచిన కౌశిక్ హరి, ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌లు గురువారం మైన్స్ కార్మికుల ఆహ్వానం మేరకు వారిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో మైన్స్ కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మైన్స్ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రమాదంపై విచారణ



సుల్తానాబాద్‌లో విచారణ జరుపుతున్న ఆర్టీసీ అధికారులు

సుల్తానాబాద్, జూన్ 20 : సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదం గురించి గురువారం ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌కు చేరుకుని విచారణ జరిపారు. బుధవారం ఆర్థరాత్రి కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వెలుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్ లోపలకు చేరి ప్లాట్ వద్ద ఆపే ప్రయత్నంలో అదుపు తప్పి ప్లాట్‌ఫామ్ పైకి దూసుకుపోయింది. ప్లాట్ పామ్ పైన ఉన్న ఒక దుకాణాం పూర్తిగా ధ్వంసమైంది. మామూలు సమయంలో అయితే అక్కడ పెద్ద ఎత్తున ప్రయాణీకులు ఉండేవారు. రాత్రి కావడంతో, అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. అప్పుడు బస్సులో యాభై మందికి పైగా ప్రయాణీకులు ఉండడం వారంతా ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురయిన బస్సులోని ప్రయాణీకులను వేరే బస్సులో అర్ధరాత్రి పన్నెండున్నర ప్రాంతంలో గోదావరిఖనికి పంపించారు. అయితే గురువారం తెల్లవారఝామున కరీంనగర్ - 2 డీపో నుంచి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ కమల, గోధావరిఖని డిపో నుంచి మెకానిక్ ఫోర్‌మెన్ సంధ్యారాణి, పెద్దపల్లి నుంచి స్టేషన్ కంట్రోలర్ రామ్ గోపాల్ రెడ్డి తదితరులు వచ్చి సంఘటన గురించి ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు బస్సు స్టేషన్లలో ఇలాగే బస్సులు ఒక్కసారిగా ప్లాట్‌ఫారాల పైకి దూసుకురావడం, అక్కడ వేచి ఉండే ప్రయాణీకులు మృతి చెందిన సంఘటనలు జరిగాయి. దాంతో ఆర్టీసీ అధికారులు ఇలాంటి ప్రమాదాల నివారణకు, అదుపు తప్పిన సంఘటనల్లో బస్సులు ప్లాట్‌ఫారాల పైకి రాకుండా బస్సులు నిలిపే స్థలంకు ముందు అడ్డుగా దిమ్మెలు నిర్మాంచారు. కానీ సుల్తానాబాద్ బస్టాంట్‌లో బుధవారం జరిగిన సంఘటనలో దుకాణం వైపు దిమ్మెలేక పోవడం గమనార్హం.

నియోజకవర్గంలో భ్రష్టు పట్టిన పోలీస్ వ్యవస్థ

- కాళేశ్వరం ఎస్ఐ దుశ్చర్యకు మంత్రి బాధ్యత వహించాలి - జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని, జూన్ 20: మంథని నియోజక వర్గంలో పోలీస్‌వ్యవస్థను ఎమ్మెల్యే కుటుంబం నాటి నుంచి నేటివరకు అనేక సందర్భాల్లో భ్రష్టుపట్టిస్తూనే ఉందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు విమర్శించారు. తన నివాసంలో పుట్ట మధు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యే మంత్రి తండ్రి ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్పీ తన మాట వినలేదని ఇక్కడి నుంచి మరోచోటికి ట్రాన్స్‌ఫర్ చేయిం చారన్నారు. తమ మాట వింటూ కాంగ్రెస్ కండువా కప్పుకునే పోలీస్ అధికారులకు మాత్రమే ఇక్కడ పోస్టింగ్‌లు ఇచ్చేవారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంథని నియోజకవర్గంలోని మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పోస్టింగ్‌కు మంత్రి సోదరుడు ముడుపులు తీసుకుని ప్రస్తుత ఎస్ఐకి పోస్టింగ్ ఇప్పించారన్నారు. ఇలా ఎమ్మెల్యే సోదరుడు తమకు నచ్చిన వారికి ఇక్కడ పోస్టింగ్‌లు ఇప్పించి తనపై కుట్రలు చేస్తున్నారని, గతంలో ఇక్కడ పని చేసిన సీఐకి ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారని గుర్తు చేశారు. కాటారంలో ఎస్ఐగా పని చేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని సీఐకి మంథనిలో పోస్టింగ్ ఇచ్చారన్నారు. రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి సన్నిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఓ మహిళా కానిస్టేబుల్ పై అఘాయిత్యానికి పాల్పడటం ప్రతిఒక్కరు ఖండించాలని, ఈ వ్యవహారం కాళేశ్వర క్షేత్రానికే మాయని మచ్చగా మిగిలిపోతుందన్నారు. ఈ ఘటనకు మంత్రి, ఆయన సోదరుడు బాధ్యత వహించి ప్రజలకు ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐ వ్యవహారంపై తమ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే సదరు ఎస్ఐకి కాళేశ్వరంలో పోస్టింగ్ ఇప్పించారన్నారు. కాళేశ్వరం ఎస్ఐ మంత్రి సోదరుడికి సన్నిహితుడని పదేపదే చెప్పేవాడని, వారి అండదండలతోనే అఘాయిత్యాలు, ఆరాచకాలకు పాల్పడ్డాడన్నారు. నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారుతున్నాయని, ఇటీవల మహాదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లోనే కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఓ జడ్పీటీసీ భర్త డాన్స్ చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, సెగ్గెం రాజేష్, మాచీడి రాజుగౌడ్, బత్తుల సత్యనారాయణ, కాయతీ సమ్మయ్య, సత్య నారాయణగౌడ్, వంశీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం పెద్దయ్య స్వామికి పూజలు



దప్పుచప్పుల్లతో పెద్దయ్య ఆలయానికి వెళ్తున్న జయ్యారం గ్రామస్థులు

పాలకుర్తి, జూన్ 20: వరణుడు కరుణించాలని పాలకుర్తి మండలం పరిధిలోని జయ్యారం గ్రామస్థులు గురువారం అంకమెట్టు గుట్టకు వెలసిన పెద్దయ్య స్వామికి పెద్దఎత్తున మెక్కులు చెల్లించుకునేందుకు మేకపోతులు, గొర్రెపోతులు, కోళ్లు, కొబ్బరి కాయలు, గదలు, త్రిశూళం, జెండాలతో డప్పుచప్పుళ్లతో పెద్దఎత్తున బయలుదేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు లేక కరువు వచ్చినప్పుడు ఈ ప్రాంత రైతులంతా పెద్దయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్,మాజీ సర్పంచ్ చింతకింది నర్సమ్మ,మాజీ ఉపసర్పంచ్ గాజుల ప్రసాద్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు, రైతులు చింతకింది పోచమల్లు, చింతల మురళి, వేముల వెంకన్న, కాసార్ల ఆశాలు, ఆడెపు లింగయ్య, చింతకింది మల్లేశం, మేర్గు బొర్రయ్య, బీస్పెల్లి ఐలయ్య, లింగయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

పెద్దపల్లి రూరల్, జూన్ 20 : మండలంలోని కాపులపల్లిలో గురువారం గ్రామస్థులు వర్షం కోసం కప్పతల్లి ఆట ఆడారు. ప్రస్తుతం రెండో కార్తె ముగింపు దగ్గర అవుతున్నప్పటికి ఇప్పటివరకు కూడ అనవృష్టి నెలకొందని గ్రామస్థులు తెలిపారు. వానదేవుడు కరుణించి వర్షం కురిపించాలని రోకలిబండకు కప్పను కట్టి ఊరేగిస్తూ కప్పతల్లి ఆట ఆడారు. అనంతరం చిన్నయ్య పెద్దయ్య దేవుళ్ల వద్ద జలాభిషేకం నిర్వహించారు.

గన్నేరువరం, జూన్ 20: తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామ శివారు లో అక్రమంగా ఇసుకను డంపు చేసి ఎక్స్‌కావేటర్ సహాయంతో లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న తరలిస్తున్న లారీని గురువారం మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లారీని, ఎక్స్‌కా వేటర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ కోరపు సంపత్‌రెడ్డి, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్ మెండ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకు న్నారు. లారీ యజమాని కొండుగారి తిరుపతిరెడ్డి, ఎక్స్‌కావేటర్ యజమాని గూడెల్లి నరేష్, ఇసుక డంపు చేయించిన చింతల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ధర్మారం,జూన్20: ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామంలో గురువారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను పౌరసరఫరాల శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నర్సింహులపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో 100క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ చెప్పారు. పంచనామా చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యంను భద్రపరిచినట్టు తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు ఉన్నారు.

పీజీ పరీక్ష రుసుం గడువు 28 వరకు

గణేశ్‌నగర్,జూన్ 20: ఎం.ఏ, ఎం.కాం, ఎమ్మెస్సీ, ఎం.ఎస్.డబ్ల్యూ,ఎం.బీ.ఏ, ఎం.సీ.ఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 28వ తేదీ వరకు తుది గడువు అని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300/- రూపాయల అపరాధ రుసుంతో జూలై నెల 2వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, మొత్తం ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడి మృతి


పోచయ్య(ఫైల్)

వేములవాడ రూరల్, జూన్ 20: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నూకలమర్రి గ్రామానికి చెందిన గసికంటి పోచయ్య(63) గ్రామ పంచాయతీలో తాత్కాలిక కార్మికుడిగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. గురువారం చెత్త సేకరణలో భాగంగా ట్రాక్టర్‌పై వెళ్తుండగా మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టడంతో పోచయ్య ట్రాక్టర్ పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో గమనించిన స్థానికులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కార్మికులు కోరుతున్నారు. కాగా మృతుడు గసికంటి పోచయ్య కుటుంబానికి తక్షణ సాయం కింద కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 50,000 రూపాయల చెక్కును రూరల్ తహసీల్దార్ సుజాత ద్వారా అందజేశారు.

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- సీఐటీయూ, ఏఐటీసీయూ ధర్నా

సిరిసిల్ల టౌన్: నూకలమర్రి గ్రామ పంచాయతీ కార్మికుడు గసికంటి పోచయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా ప్రధాన వైద్యశాల ఆవరణలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎల్‌పీవో నరేష్ సీఐటీయూ, ఏఐటీయూసీ, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడారు. పోచయ్య కుటుంబానికి పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. డీఎల్‌పీవో నరేష్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దహన సంస్కారానికి రూ.10 వేలు అందజేశారు. నష్టపరిహారంగా ఐదు లక్షల రూపాయల వరకు అందించేలా చూస్తామని డీఎల్‌పీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం డీఎల్‌పీవో నరేష్‌కు కార్మిక సంఘాల నాయకుడు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, గంగరాజు, మహేష్, శ్రీనివాస్, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.


డీపీఎల్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిగురుమామిడి, జూన్ 20: మండలంలోని ముదిమాణిక్యం గ్రామ శివారులో కారు (టీఎస్11ఈజే3274) అతివేగంతో చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడ్డ నీలాంబర (38) అనే వ్యక్తి గురువారం మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలానికి చెందిన ముక్కిస నీలాంబర అనే వ్యక్తి బుధవారం ముదిమాణిక్యం నుంచి వెళుతుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మత్తం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నీలాంబర భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

వీణవంక, జూన్ 20: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వీణవంక మండలంలోని మామిడాలపల్లికి చెందిన సింగరవేని తిరుపతి (33) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి హార్వెస్టర్ నడుపుతూ జీవించేవాడని మద్యానికి బానిసై 15వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.మృతుని భార్య రక్షిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్,జూన్ 20: కమాన్‌పూర్ మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన అక్షయ్ కుమార్ (20) సబ్బితం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం అక్షయ్ కుమార్ తన గ్రామం నుంచి పెద్దపల్లికి ప్రతి రోజు వస్తుంటాడు. బుధవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్న తరుణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూన్ 20: సుల్తానాబాద్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన బాబురావు సోదరి నిర్మల మండలంలోని నీరుకుళ్లలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే అమె ఆత్మహత్యకు భర్త కారణమంటూ మృతురాలి సోదరుడు బాబురావు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులతో చర్చలు జరుగుతున్నాయి. నష్టపరిహారం కోసం మాట్లాడుతున్న సందర్భంలో బాబురావు తన వద్ద సిద్ధంగా ఉంచుకున్న గడ్డిమందు డబ్బా మూత తీసి అందరి ముందే తాగాడు.

అక్కడున్న వారు వెంటనే అతని చేతిలో నుంచి డబ్బా లాగి పడేసి అతన్ని సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనం తరం కరీంనగర్ తరలించారు. తన సోదరి విషయంలో కేసు నమోదులో జాప్యం జరుగుతుండటం, న్యాయం జరిగే అవకాశం లేదని అనుకున్న బాబురావు ఆత్మహత్యయత్నం చేశాడు. అయితే నీరుకుళ్ల మహిళ ఆత్మహత్య కేసులో గురువారం సాయంత్రమే ఫిర్యాదు అందిందని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీడీ టేకేదార్ మృతి


మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బీడీ టేకేదార్ ఊరడి మహేశ్(37) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అతని పైనుంచి కంటైనర్ వాహనం పోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని విజయ-వరస్వామి దంపతుల పెద్ద కొడుకు మహేశ్ స్థానికంగా బీడీ కంపెనీ నిర్వహిస్తూ జీవిస్తుండేవాడు. గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు ప్రయాణిస్తున్న కంటైనర్ వాహనం బైక్‌ను ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. మహేశ్‌పై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోధించారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కంటేనర్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లిదండ్రులు విజయ, వరస్వామి, భార్య లావణ్య కూతురు లాస్య, కొడుకు మనోజ్ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టడంతో పాటు మరో బైక్‌ను ఢీకొన్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని అర్బన్ పార్కు వద్ద గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వాహనాలను ఢీకొట్టిన యువకుడు రాజేశ్‌ను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పదిర గ్రామానికి చెందిన రేండ్ల దేవరాజు తన భార్య కావ్య, కూతురు రియాన్ష్‌లతో కలిసి తన బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు మద్యం మత్తులో బైక్‌పై అతివేగంగా దూసుకుపోయిన యువకుడు రాజేశ్ ముందుగా దేవరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. వారి వెనుక వస్తున్న గొల్లపల్లిలోని డిగ్రీ విద్యార్థులు ఇరుముల శ్రీమాంత్, వంశీల వాహనాన్ని ఢీకొట్టి ముందుకు పోయాడు. దేవరాజు, కావ్య, రాజేశ్, శ్రీమాంత్, వంశీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో చిన్నారి రియాన్ష్ బయట పడింది. కేసు నమోదు చేనట్లు పోలీసులు వివరించారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కావ్య

ఇద్దరు దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 20: కరీంనగర్‌లోని మెహర్ నగర్‌లో ఈ నెల 15న చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేశామని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. మెహర్‌నగర్‌కు చెందిన సందూరి లక్ష్మి మెడలోని పుస్తెల తాడును తెంపుకుని పారిపోయిన నిందితులు విద్యానగర్‌లో నివాసం ఉంటున్న పున్నం శ్రీనివాస్, సాయినగర్‌కు చెందిన అందె శ్రీనివాస్‌లను ఆదర్శనగర్‌లో అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 7 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

హోటళ్లు, హాస్పిటల్స్‌పై బల్దియా అధికారుల దాడులు

కరీంనగర్ టౌన్, జూన్20: నగరంలోని పలు హోటళ్లు, హాస్పిటళ్లపై నగర పాలక సంస్థ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గురువారం నాలుగు హోటళ్లు, రెండు హాస్పిటల్స్‌ను అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్‌ను పాటించకపోవడం, ఇతరత్రా నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తున్నట్లు గుర్తించిన సంస్థల నుంచి 9,500 రూపాయల జరిమానా వసూలు చేశారు. తిరిగి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప రంగా శిక్షిస్తామని అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎస్సై

తిమ్మాపూర్, జూన్ 20: మండలంలోని రేణికుంట సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎల్ఎండీ పోలీసులు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. రేణికుంట గ్రామ శివారులో నిల్వ చేసిన సుమారు 20ట్రాక్టర్లకుపైగా ఉన్న ఇసుక డంపులను కూడా స్వాధీనం చేసుకొని రెవెన్యూ శాఖకు అప్పగించామని ఎస్సై చేరాలు తెలిపారు.

అత్యాచారయత్నం చేసిన వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, జూన్ 20: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామానికి చెందిన ఓ వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ట్రాన్స్‌కో ఉద్యోగి షాబుద్దీన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గోదావరిఖనికి చెందిన సదరు మహిళ కొంతకాలంగా గ్రామంలో టైలరింగ్ పనిచేసుకుంటూ నివాసం ఉంటోంది. ఈ క్రమంలో షాబుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహితపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని విషయాన్ని బంధువులకు తెలిపింది. వివాహిత ఫిర్యాదు మేరకు షాబుద్దీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో చట్టం కింద ఒకరి అరెస్టు

మెట్‌పల్లి, జూన్, 20 : పట్టణానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బత్తిని నవదీప్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి పట్టణ అనుసంధాన గ్రామమైన ఆరపేటకు చెందిన బత్తిని నవదీప్ పట్టణానికి చెందిన బాలికపై లైగింక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి ఈ నెల 12న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఈడీని కలిసిన రీజియన్ మేనేజర్లు


ఆర్టీసీ ఈడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రీజినల్ మేనేజర్‌లు

భగత్‌నగర్, జూన్ 20: వరంగల్, ఖమ్మం రీజియన్‌లకు నూతన రీజినల్ మేనేజర్లుగా నియమితులైన డి విజయభాను, ఎ సరిరాంలు బుధవారం కరీంనగర్‌లోజోన్ ఈడీ సి వినోద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రీజినల్ మేనేజర్‌లుగా పదోన్నతి పొందిన ఇద్దరిని జోన్ ఈడి వినోద్‌కుమార్ అభినందించారు. డి విజయభాను గతంలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్‌గా), ఎ సరిరాం రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా పనిచేశారు.

ఆర్టీసీ కరీంనగర్ ఒకటో డీఎం సస్పెన్షన్

భగత్‌నగర్, జూన్ 20: కరీంనగర్ వన్ డిపో మేనేజర్ లక్కు మల్లేశంను ఆర్టీసీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఈడీ వినోద్‌కుమార్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కామారెడ్డి డిపో నుంచి కరీంనగర్ వన్ డిపోకు మేనేజర్‌గా దాదాపు ఏడాదిక్రితం వచ్చిన మల్లేశంపై ఫిర్యాదులు రావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చెబుతున్నారు. సస్పెండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికాలేదు.

ఒకరిపై దాడి.. ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఇల్లు పంపకం విషయంలో తలెత్తిన వివాదంలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన కుంభాల లక్ష్మారెడ్డిపై దాడి చేసిన సంఘటనలో అదే గ్రామంలోని కుంభాల సత్యంరెడ్డి, అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ కిషన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి మధ్య తాతలు సంపాదించిన ఇల్లు విషయంపై గొడవలు జరుగుతున్నాయి. తమను మోసగించి సత్యంరెడ్డి తన పేరిట చేయించుకున్నాడని లక్ష్మారెడ్డి పేర్కొంటున్నారు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా ఇల్లు వాటా కింద సోదరుడు లక్ష్మారెడ్డికి రూ.5 లక్షలు చెల్లిస్తానని అంగీకరించారు. యేడాది కిందట సత్యంరెడ్డి రూ.2లక్షలు మధ్యవర్తి ఎలుసాని మల్లారెడ్డికి అప్పగించాడని చెప్పారు. దాంట్లో నుంచి రూ.10 వేలు పట్టుకుని మిగతా డబ్బులు లక్ష్మారెడ్డికి ముట్టజెప్పాడని పేర్కొన్నారు. యేడాది గడిచినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 20న మల్లారెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లక్ష్మారెడ్డి కోరాడని తెలిపారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సత్యంరెడ్డి అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలు అడ్డగించి కర్రలతో దాడికి దిగారని లక్ష్మారెడ్డి చెప్పారు. లక్ష్మారెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడని పేర్కొన్నారు. బాధితుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు సత్యంరెడ్డి, మయూరి, మల్లారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్ఐ కిషన్‌రావు వివరించారు.

బడిబాట కార్యక్రమంపై కళాకారుల ప్రదర్శన

కాల్వశ్రీరాంపూర్, జూన్ 20: కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం సభ్యులు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గురువారం పాటల ద్వారా ప్రచారం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు కోండ్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేష్‌గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, దీకొండ శ్రావణ్, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, కన్నూరి రేణుక, కట్కూరి శ్రీవల్లి పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

మార్కండేయకాలనీ, జూన్ 20: గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం క్లబ్ బాయ్‌గా పనిచేసే ఇంతియాజ్ కూతురు వివాహానికి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆర్‌జీ-1,2 ఆధ్వర్యంలో రూ.1.87 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం అసోసియేషన్ ప్రతినిధులు ఇంతియాజ్‌కు రూ.1,87,118లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ బాధ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే చౌకబారు మాటలు

కమాన్‌పూర్, జూన్ 20 : నియోజకవర్గంలో ఉనికిని చాటుకోవడం కోసమే మంత్రి శ్రీధర్‌బాబుపై జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు ఆరోపణలు చేస్తున్నారని జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కూడా ఈ ఎస్‌ఐపై ఆరోపణలు వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తప్పు చేసిన వెంటనే విధుల నుంచి శాశ్వతంగా తొలగించి నిజాయితీ చాటుకున్న మంత్రి శ్రీధర్‌బాబుపై చౌకబారు రాజకీయాలు ఆరోపణలు చేయటం హాస్యాస్పదమన్నారు. నియోజకవర్గ అభివృద్ధి మంత్రి శ్రీధర్‌బాబు, సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబులు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పుట్ట మధు అధికారంలో ఉన్న సమయంలో చేసిన అరాచకలు ప్రజలందరికి తెలుసనని స్పష్టం చేశారు. మరోసారి చౌకబారు ఆరోపణలు చేస్తే ఉరుకునేది లేదని హెచ్చరించారు.

ముగిసిన పెద్దమ్మ తల్లి ఉత్సవ వేడుకలు

కమాన్‌పూర్, జూన్ 20 : మండలంలోని జూలపల్లి గ్రామంలోని మల్లికార్జున నగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. బుధవారం రాత్రి ముదిరాజ్ కులస్థులు ఇంటింటి నుంచి బోనాలు తీశారు. ఈ వేడుకల్లో డోలు చప్పుళ్ల, డీజే సౌండ్ మొతలు మారుమోగాయి. బోనాల ఉత్సవం ముగిశాక బలి కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శరణార్థులకు చేయూతనివ్వాలి

భగత్‌నగర్, జూన్ 20: ప్రతిఒక్కరూ శరణార్థులకు చేయూతనివ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం శరణార్థుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చాలామంది శరణార్థులు ఉన్నారన్నారు. ఐక్యరాజ్య సమితి శరణార్థులకు గుర్తింపునివ్వడం ద్వారా వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్ర మంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

సుల్తానాబాద్, జూన్ 20: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు గురువారం పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా సంఘం అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ కోశాధికారి జొన్నకోటి వెంకటేశ్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు గురువారం పంచాయతీరాజ్ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క ఓఎస్‌డీ నరేందర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావును హైదరాబాద్‌లో కలిశారు. ఈ మేరకు తాము పడుతున్న ఇబ్బందులను తమ సమస్యలను డిమాండ్లను వారికి వివరించామని, వినతిపత్రాలను సమర్పించామని జొన్నకోటి వెంకటేశ్ సుల్తానాబాద్‌లో విలేకరులకు తెలిపారు. మంత్రితో పాటు ఉన్నతాధికారులను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు మామిడాల నరసింహులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి పిల్లి రవి, నాగరాజు, లక్ష్మణ్, శ్రీదర్, సురేందర్, కట్టయ్య తదితరులు ఉన్నారని వివరించారు.

'మేయర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, జూన్ 20: మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల మేయర్ సునీల్‌రావు చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పులి ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'నీట్'పై సమగ్ర విచారణ జరపాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 20: నీట్ పరీక్ష కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ ఛైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ 10 ఏళ్ళుగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేపర్ లీకేజి ఘటనలు ఎన్ని జరిగిన కేంద్ర ప్రభుత్వం స్పందించడంలేదన్నారు.



సుల్తానాబాద్‌లో మాత్రలు వేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి



కమాన్‌పూర్‌లో మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

సుల్తానాబాద్, జూన్ 20: పిల్లల కడుపులో నులి పురుగులు చేరితే రక్తహీనత, పోషకాల లేమి, ఆకలి మందగించడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వీటి నివారణకే అల్బెండజోజ్ మాత్రలను వేయించాలని సుల్తానాబాద్ మున్సిపల్ ఛైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలోని హైస్కూల్ లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు నుంచి పందొమ్మిద ఏళ్ల వయస్సుగల పిల్లలందరికీ ఈ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఛైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాజుల లక్ష్మి మాట్లాడుతూ నులిపురుగుల చేరిక వలన కలిగే నష్టాలను వివరిస్తూ ప్రతీ ఒక్కరు తమ పిల్లలకు ఈ మాత్రలను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, డాక్టర్లు సింధూజ, శ్రీజ, ఉదయతో పాట కళాశాల అధ్యాపకులు రత్నాకర్, మోహరాజ్, ఏఎన్ఎంలు శారద, రమ, సరస్వతి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముత్తారం జూన్ 20 : మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులకు మాత్రలు వేశారు. సీతంపేట గ్రామంలో ఎంపీపీ జక్కుల ముత్తాయ్య అధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో, అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఎంపీటీసీ దోడ్డ గీతారాణి అధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... 1 నుంచి 19 సంవత్సరం వయస్సు ఉన్న పిల్లలందరి కీ ఆల్బెండజల్ టాబ్లెట్లను తప్పకుండా విద్యార్థులు విద్యార్థులు ప్రతి సంవత్సరం తప్పకుండా వాడాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్‌పర్సన్ చిగురు స్రవంతి విద్యాసాగర్, హెడ్మాస్టర్ ఓదెలు, నరసింహా రెడ్డి, సూపర్వైజర్ లక్ష్మి, వీరేశం, హెల్త్‌అసిస్టెంట్ నరసయ్య, ఏఎన్ఎం సునీత ఆశ వర్కర్లు జ్యోతి, రజిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూన్ 20: మండలంలోని పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆల్‌బెండజోల్ మాత్రలు వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. ఏడాదినుంచి 19ఏళ్లలోపు పిల్లలకు మాత్రలు పంపి ణీ చేసినట్లు డాక్టర్లు మహేందర్, శ్రీనివాస్ తెలిపారు.

ఎలిగేడు, జూన్ 20 : అల్బెండజోల్ మాత్రలు నట్టల నివారణకు తోడ్పడుతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిస్సిక్రిష్టాన తెలిపారు. గురువారం నేషనల్ డెవర్మింగ్ డే సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్వాడీ కేంద్రాల్లో 1-19ఏళ్ల పిల్లలు 3285మంది ఉండగా 3086మందికి అల్బెండాజోల్ మాత్రలు వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన పిల్లలకు జూన్ 27న మరోసారి వేస్తామని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్‌వో విజేందర్‌రాజు, సూపర్‌వైజర్లు లక్ష్మణ్, నాగమణి, ఏఎన్ఎం, ఆశాలు, హెచ్‌ఎంలు గంద్ర దేవేందర్‌రావు, నరేంద్రచారి, సదయ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూన్ 20 : నులి పురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుందని మండల వైద్యాధికారి అశోక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1-19 సంవత్సరాలలోపు విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ చేసినట్లు తెలిపారు. 6800 మంది విద్యార్థులకు 6683 మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ జరిగినట్లు తెలిపారు.

పాలకుర్తి, జూన్ 20: మండలం పరిధిలోని బసంత్‌నగర్ తెలుగు మీడియం హైస్కూల్,ప్రైమరి స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు గురువారం నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీవో షబ్బీర్‌పాషా, బసంత్‌నగర్ పీహెచ్‌సీ వైద్యురాలు హరితభవాని, హెచ్‌ఎం గాయిత్రి, సూపర్‌వైజర్ దేవాంజలి, ఏఎన్ఎం జ్యోష్న, తదితరులు పాల్గొన్నారు.



మంగపేట ఉన్నత పాఠశాల మాత్రలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



బసంత్‌నగర్‌లో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి

-ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు

గణేశ్‌నగర్, జూన్ 20: ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని ప్రభుత్వం, అధికారులు అరికట్టాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ విద్యారంగం మీద రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందని తెలిపారు. బ్రాండ్ల పేరుతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. నూతనంగా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ముఖ్యమంత్రి విద్యారంగం గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో విద్యకు మంత్రి కరువైపోయారన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం స్పెషల్ కమిటీని వేసి పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీని విద్యాధికారులు అరికట్టకుంటే ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. లేకపోతే గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వానికి కూడా బుద్ధి చెప్పే దిశగా ఏబీవీపీ ఉద్యమ కార్యచరణ ఉంటుందని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి బామాండ్ల నందు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు చింతలతాడేం మధు, జిల్లా హాస్టల్స్ ఇంచార్జ్ వర్ధన్, నగర సంయుక్త కార్యదర్శి వంశీ, ఉదయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సహకరించండి

-కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మేయర్ వినతి

కరీంనగర్ టౌన్, జూన్20: కరీంనగర్ మరింత అభివృద్ధి జరిగేందుకు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నగరానికి మొదటిసారి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌ను మహాశక్తి దేవాలయంలో గురువారం మేయర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి సంజయ్‌కుమార్‌తో స్మార్ట్‌సిటీ, ఇతర అభివృద్ధి అంశాలపై మేయర్ చర్చించారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో సహచర కార్పొరేటర్‌గా పనిచేసిన బండి సంజయ్ కుమార్ రెండుసార్లు ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రి కావడం నగర ప్రజలకు గర్వకారణమని అన్నారు. నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనులు, ఇతరత్రా నిధులతో చేపడుతున్న అభివృద్ధి అంశాలపై మంత్రితో చర్చించామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, బండ సుమ రమణారెడ్డి, కాసర్ల ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న మేయర్ సునీల్‌రావు

స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన విద్యార్థులకు అభినందన



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమ

మంథని, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రతిభ పరీక్షలో స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాంసాని విక్రాంత్, ఇటికాల తేజశ్రీలు ప్రతిభను చాటడంతో వారిని మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్‌లు అభినందించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఎంపీపీలు విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, కౌన్సిలర్ వీకే రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెద్దపల్లిటౌన్, జూన్ 20: పట్టణంలోని 12వ వార్డు సాగర్ రోడ్డుకు చెందిన నిట్టూరి వైష్ణవి పాముకాటుతో ఇటీవల మృతిచెందిగా విజ్ఞాన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు. అలాగే వారి కుటుంబానికి బొడ్డుపల్లి శ్రీనివాస్ కొంత నగదును తల్లి నిట్టూరి రేణుకకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్, భీమోజు సురేందర్, దేవరకొండ రాజు, రాచమల్ల అంజయ్య, కట్ట రమేష్‌కట్ట నరేష్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

సుల్తానాబాద్, జూన్ 20: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కరీంనగర్ నియోజకవర్గానికి వచ్చిన బండి సంజయ్‌ను సుల్తానాబాద్‌కు చెందిన పలువురు బీజేపీ నాయులు కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ సుల్తానాబాద్ పట్టణ శాఖ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఎస్ఎన్‌సీ వనజ, ప్రధాన కార్యదర్శి గజబీంకార్ పవన్, పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్ గుడ్ల వెంకటేశ్, ఛత్రపతి శివాజీ అధ్యక్షుడు ఎనగందుల సతీష్, చిట్టవేని సదయ్య తదితరులు బుధవారం కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసంలో కలశారు.

'డిస్పెన్సరీలో సమస్యలు పట్టించుకోని అధికారులు'

రామగిరి, జూన్ 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలోని డిస్పెన్సరీలో సమస్యలు సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మోల్మామూరి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం డిస్పెన్సరీని సందర్శించి ఆయన మాట్లాడారు. మహిళా వైద్యురాలు లేక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల కుటుంబాలకు సరైన వైద్యం అందించడం లేదని ఆయన విమర్శించారు. ఆర్జీ-3 డిస్పెన్సరీని పది పడకల ఆసుపత్రికి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగల శ్రీధర్, శ్రీకాంత్, రాము, ధీరజ్‌కృష్ణ పాల్గొన్నారు.

తూములకు మరమ్మతులు చేపట్టాలి



నీటి పారుదల శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న యువకులు

పెద్దపల్లి రూరల్, జూన్ 20: పెద్దపల్లి మండలంలోని కొత్తపల్లి ఊర చెరువుకు సంబంధించిన ధోని, తూములకు సంబంధించిన షెటర్లు పలు ఏళ్లుగా శిథిలావస్థకు చేరాయని వాటిని వెంటనే మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకురావాలని నీటి పారుదల శాఖ ఈఈకి పలువురు యువకులు వినతిపత్రం అందించారు. త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు సహకారం అందిస్తానని అధికారి పేర్కొనట్లు యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసాని లెనిన్, ఎంచర్ల తిరుమలేష్, శిలారపు మహేష్, కళవేనా మహేష్ ఉన్నారు.

'దుద్దిళ్ల సోదరులపై ఆరోపణలు అర్థరహితం'

మంథని, జూన్ 20: కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ లైంగిక దాడిని పుట్ట మధు రాజకీయంగా వాడుకొని మంత్రి శ్రీధర్‌బాబు, శీనుబాబులపై ఆరోపణ చేయడం అర్థరహితమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ అన్నారు. వారు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దుద్దిళ్ల సోదరులపై మధు చేసిన ఆరోపణలు నిరూపించాలని లేదంటే రాజకీయ సన్యాసం తీసుకోవాలని సవాల్ విసిరారు. నేర ఆరోపణలు ఉన్నటువంటి భవానిసేన్‌ను మంథని నియోజకవర్గానికి రెండో ఎస్సైగా తీసుకువచ్చింది పుట్ట మధు అని ఆరోపించారు. లైంగిక ఘటనకు పుట్ట మధు నైతిక బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. మధును నియోజకవర్గం ప్రజలు మరిచిపోయారని, మరోసారి చౌకబారు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో సింగిల్ ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు వొడ్నాల శ్రీనివాస్, నూకల బానయ్య, గోటిగారి కిషన్‌జీ, మంథని సత్యం, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు, అజీం ఖాన్, మద్దెల రాజయ్య, ఆర్ల నాగరాజు, ఆరేళ్ల కిరణ్ గౌడ్, కాజీపేట బాబు, రోడ్డ రాజేశ్వర్, గొల్లపల్లి శ్రీనివాస్, ఎరుకల సురేష్, ఆర్ల నారాయణలు పాల్గొన్నారు.

'మంత్రిపై అసత్య ఆరోపణలు'

రామగిరి, జూన్ 20: ప్రతిపక్షంగా విమర్శించడానికి వీలు లేకుండా ప్రజాపాలన కొనసాగుతున్నదని,దీన్ని తట్టుకోలేని జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఒక ప్రకటనలో ఆరోపించారు. కాళే శ్వరం ఎస్ఐ భవానిసేన్ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి ఆయనను విధుల్లో నుం చి డిస్మిస్ చేసిందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అలివేణి

పెద్దపల్లి రూరల్, జూన్ 20 : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని తద్వారా పంటలకు అనుగుణంగా తీసుకోవాల్సిన ఎరువులపై అవగాహన ఉంటుందని పెద్దపల్లి మండల వ్యవసాయాధికారిణి అలివేణి అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో ఏరిస్ అగ్రోస్ లిమిటెడ్ కంపని ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కల్పన, ఏరీస్ కంపెనీ డెవలప్‌మెంట్ అధికారి సుధాకర్, మునిందర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎం

రామగిరి, జూన్ 20: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీహర్షను గురువారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు కలెక్టర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్జీ-3 ఏరియా బొగ్గు ఉత్పత్తి రవాణా పరమైన అంశాలను వివరించారు. ఏరియాలోగల ఓపెన్‌కాస్టుల విస్తరణకు కావాల్సిన భూసేకరణకు సంబంధించి అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. సింగరేణి విస్తరణకు సహాయసహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్స్ అధికారి ఐలయ్య ఉన్నారు.

ముగిసిన ఈపీ ఆపరేటర్ ట్రైనీ పరీక్షలు

రామగిరి, జూన్ 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో కొనసాగుతున్న ఈపీ ఆపరేటర్ ట్రైనీ నైపుణ్య పరీక్షలు గురువారం ముగిశాయి. మూడురోజులపాటు నిర్వహించిన పరీక్షలకు 337 మంది అభ్యర్థులకు 308 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు వెల్లడించారు. నైపుణ్య పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 30న రాత పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

24న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

రామగిరి, జూన్ 20: బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల24న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆకుల వెంకన్న తెలిపారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడాన్ని నిరసిస్తూ ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కార్మిక వర్గం హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, ఇమామ్, రఘుపతి, ఓదెలు, సదానందం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్



ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 20: ఆర్జీ-2 ఏరియా పరిధిలో గైర్హాజరీ ఉద్యోగులకు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 65 మంది ఉద్యోగలకు గాను 34 మంది ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం సూర్యనారాయణ మాట్లాడారు. విధులకు సక్రమంగా హాజరుకాకుండా గైర్హాజర అయితే ఉద్యోగి కుటుంబం ఆర్థికంగా నష్టపోవడంతో పాటు సంస్థ కూడా నష్ట పోతుందని అన్నారు. ఈరోజుల్లో ప్రైవేట్ సంస్థల్లో చిన్ని ఉద్యోగం సంపాదించడం కష్టమైన పని అని, అటువంటిది ప్రతిష్టాత్మక సంస్థ అయిన సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టంగా భావిం చాలని అన్నారు. ఉద్యోగులకు అనేక సంక్షేమ పథకాలను యాజమాన్యం అందిస్తున్నదని, దేశ అభివృద్ధిలో తన వంతు బాధ్యతను నిర్వర్తించడం కర్తవ్యంగా భావించాలని జీఎం గైర్హాజరీ ఉద్యోగులకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు కలసి నివృత్తి చేసుకుని అవసమైన సహాయ సహకారాలను పొందాలని సూచించారు. క్రమశిక్షతో విధులకు హాజరై కుటుంబ పోషణను నిర్వర్తిస్తూ, సంస్థ అభివృద్ధిలో భాగ స్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు మాలతీ సూర్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, అధికారులు శ్రీనివాసరెడ్డి, రాజేంద్రప్రసాద్, డాక్టర్ మహిపాల్, షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దాం : జీఎల్‌బీకేఎస్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 20: బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సింగరేణి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో యూనియన్ రామగుండం రీజియన్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మైనింగ్ పాలసీ పేరిట దేశంలోని బొగ్గు బ్లాక్‌ల ను వేతం వేస్తున్నదని, ఈవేలం ప్రక్రియ ద్వారా బొగ్గు బ్లాక్‌లు కార్పొరేట్ సంస్థ లకు దక్కే అవకాశాలు ఉన్నాయని అన్నారు. అదే జరిగితే బొగ్గు పరిశ్రమలోని ప్రభుత్వ రంగ సంస్థలకు, వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇబ్బందిక పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలోని నాలుగు బ్లాక్‌లు వేలం జాబితాలో ఉన్నాయని తెలిపారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వేలం విధానాన్ని వ్యతిరేకించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. వేలం ప్రక్రియను అడ్డుకునేలా అన్ని కార్మిక సంఘాలు ఉద్యమించాలని, జీఎల్‌బీకేఎస్ అటువంటి ఆందోళనలకు కలసి వస్తుందని రామకృష్ణ పేర్కొన్నారు.

ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈసంపల్లి రాజేందర్, నాయకులు గుండేటి మల్లేష్, ప్రసాద్, శేఖర్, రాజనర్సు, దేవయ్య, మనోజ్ పాల్గొన్నారు.